www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023
5
చిత్తూరు





రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నేతలు

యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఏలూరులో జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశాల్లో రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు టి.రఘుపతి రెడ్డి, ఎస్ఎస్.నాయుడుతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రతినిధులు ఎన్.మణిగండన్, జీవి రమణ, సిపి ప్రకాష్, కె.దీనావతి, ఎస్ పి బాషా, జిసికే ప్రసాద్, కె.రెడ్డెప్ప నాయుడు, డి.ఏకాంబరం, బి.ఈశ్వర్ మహేంద్ర, పంటపల్లి సురేష్, పిసి.బాబు పాల్గొన్నారు.

రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఉద్యమిద్దాం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్



వేదికపై అభివాదం చేస్తున్న వివిధ రాజకీయపార్టీల నేతలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్: వెనుకబాటు తనానికి మారుపేరుగా నిలిచిన రాయలసీమ సమగ్రాభివృద్ధికై ఐక్యంగా ఉద్యమిద్దామని వివిధ రాజకీయపార్టీల నేతలు పిలుపునిచ్చారు. జనచైతన్య వేదిక ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తిరుపతి నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాయలసీమ అభివృద్ధి సమస్యలపై జరిగిన చర్చాగోష్టికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు ఎం.ఎ.గఫూర్, రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎన్.తులసీ రెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర విభజన చట్టం హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయనందున రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందన్నారు. బుందేల్ ఖండ్ ప్యాకేజీ అమలు చేయకపోవడం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలో కడప స్టీల్ ఫ్యాక్టరీని పొందలేకపోవటం, హైకోర్టును సాధించలేకపోవడం, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసుకోలేకపోవడం వలన రాయలసీమ ప్రాంత అభివృద్ధి కాలేకపోయిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మోటారు బావులుండగా ఒక్క రాయలసీమలోనే 12 లక్షల మోటార్ బావులు ఉన్నాయని వీటన్నింటికీ స్మార్ట్ మీటర్లు పెడితే రాయలసీమ రైతులకు అవి ఉరితాళ్ళు గా మారుతాయని అన్నారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి వాటి అమలుకు రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా కృషి జరగాలన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌కు నీటిసమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ 1956 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ఆయా రాష్ట్ర బడ్జెట్లలో 10శాతం పైగా కేటాయించి ఖర్చుచేస్తే నేటి ప్రభుత్వం గత ఐదు బడ్జెట్లలో ఐదు శాతం లోపే కేటాయించి, మూడు శాతం మాత్రమే వ్యయం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులపట్ల రాష్ట్ర ప్రభుత్వ నిరాసక్తత ఫలితంగా రాయలసీమ కరువు ప్రాంతంగా మారిందన్నారు. నేటి ప్రభుత్వం ఉత్పాదక రంగాలకు వెచ్చించకుండా అనుత్పాదక రంగాలకు వ్యయం చేయడం, అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం, అప్పులు చేసి ప్రజలను యాచకులుగా మారుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ప్రసంగిస్తూ రాయలసీమకు నీరు, నిధులు, నియామకాలు జరగాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత వైఖరి కారణంగా వేలాది మందికి ఉపాధి అందించే అమర్ రాజా ఫ్యాక్టరీ తెలంగాణకు తరలిపోయిందన్నారు. సిపిఐ రాష్ట్ర సీనియర్ నేత జి.ఓబులేష్ ప్రసంగిస్తూ వరదకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు రూ.10కోట్లు వెచ్చించలేకపోవడం వలన గత మూడు సంవత్సరాలుగా పునర్నిర్మాణం జరగలేదన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఏమేమి చేస్తారో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రణాళికలో తెలపాలన్నారు. తెలుగుదేశం పార్టీ నేత మాజీ శాసనసభ్యులు ఎం.సుగుణమ్మ ప్రసంగిస్తూ రాయలసీమ ప్రాంతంలో నీటిపారుదల ప్రాజెక్టుల కోసం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చేసిన వ్యయంలో నాలుగో వంతు కూడా వైసిపి ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఈ చర్చాగోష్టిలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు జి.నరసింహ యాదవ్, పుణ విజయకుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిపిఐ నేతలు రాధాకృష్ణ, పెంచలయ్య కాంగ్రెస్ పార్టీ నేత నవీన్ కుమార్‌రెడ్డి, జనసేన పార్టీ నగర అధ్యక్షులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాల్సిందే.. వేతనం పెంచాల్సిందే..

- 14, 15న కలెక్టరేట్ ఎదుట 'ఆశా'ల వంటావార్పు
- 36 గంటల పాటు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపు



చిత్తూరు డిఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సమస్యల పరిష్కారానికి ధర్నా చేస్తున్న ఆశాలు (ఫైల్)

ప్రజాశక్తి-కుప్పం: వెట్టి చాకిరీ చేయించుకుంటున్న 'ఆశా'లకు పనిభారం తగ్గించి వేతనం పెంచాలని ఈ నెల 14, 15వ తేదీల్లో జిల్లా కలెక్టరేట్ ఎదుట వంటావార్పుతో ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయు అనుబంధ సంఘం ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఆదివారం యూనియన్ గౌరవ అధ్యక్షులు కే.సురేంద్రన్, అధ్యక్షులు కృష్ణవేణి, కార్యదర్శి టి.గంగ వివరాలను వెల్లడించారు. 14, 15వ తేదీల్లో 36గంటల పాటు ఈ ధర్నా కార్యక్రమం సాగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశాలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ప్రధాన డిమాండ్‌లు ఇవీ..

- ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి
- కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్చాలి
- పనిభారం తగ్గించాలి, ఆన్‌లైన్, రికార్డు పని ఒకే సారి చేయించాలి
- రూ.10లక్షల గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలి
- ప్రభుత్వ సెలవులు, మెడికల్, మెటర్నిటీ లీవ్ ఇవ్వాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలి
- సంక్షేమ పథకాలు అమలు చేయాలి, ఇళ్ల స్థలం, ఇళ్లు నిర్మించి ఇవ్వాలి
- మరణించిన వారి కుటుంబంలో అర్హులైన వారికి ఆశాలుగా తీసుకోవాలి
- ఏఎన్ఎం, హెల్త్ సెక్రటరీల నియామకాలలో ఆశాలకు వెయిటేజీ ఇవ్వాలి

సమగ్ర భూ సర్వేతో భూసమస్యలకు చెక్

ఇంటర్వ్యూ



చిత్తూరు రెవెన్యూ డివిజన్ అధికారి చిన్నయ్య

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఎప్పుడో బ్రిటిష్ కాలం నాటి భూ సర్వే లెక్కలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫలితంగా భూ సమస్యలు అధికంగా వస్తున్నాయి. రెవిన్యూ అధికార్లు భూ సమస్యలపై ఎక్కువ సమయం కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించేలా హద్దులు నిర్ణయించి ప్రభుత్వ, ప్రయివేటు భూములు ఏ మేరకు ఉన్నాయి అనే విషయాన్ని పక్కా లెక్కలు తేల్చేలా సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా భూ సర్వే కొనసాగుతోంది. చిత్తూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 75 నుండి 80 శాతం భూ సర్వే డ్రోన్ కెమెరాల ద్వారా పూర్తి చేయడం జరిగింది. ఇందు కోసం ఓ ప్రత్యేక సిస్టమ్ ఏర్పాటు చేసింది. సర్వే పూర్తి చేసిన ప్రాంతాల్లో హద్దులను గుర్తిస్తూ సంబందిత రైతులకు సమగ్ర భూ సర్వే పత్రాలను కూడా పంపిణీ చేయడం జరుగుతోంది. గ్రామ సభల్లో రైతుల సమక్షంలో వారి అభిష్టం మేరకు భూ సర్వే రికార్డులో నమోదు చేసుకొని సర్వే పత్రాలను అందిస్తున్నాం. రానున్న రోజుల్లో భూమికి సంబందిన సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నామని చిత్తూరు రెవిన్యూ డివిజన్ అధికారి చిన్నాయ్య తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను తెలియజేస్తూ..

ప్రజాశక్తి : సమగ్ర భూ సర్వేతో భూ సమస్యలు తీరుతాయని భావిస్తున్నారా..?

ఆర్‌డిఒ: సమగ్ర భూ సర్వే వందశాతం పూర్తి చేస్తే దాదాపు ఎవరి భూమి ఎంత వారి హద్దులు స్పష్టంగా గుర్తించి సర్వే పత్రాలు అందిస్తున్నాం. దీని వల్ల భూ సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నాం.

ప్రజాశక్తి : తుఫాను పంట నష్టం అంచనా వేస్తున్నారా.....?

ఆర్‌డిఒ: చిత్తూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో పంట, ఆస్తి నష్టం అంచనా వేసేలా తాహాశీల్దార్లు ఆదేశించడం జరిగింది. రెవిన్యూ క్షేత్రస్థాయి సిబ్బంది ఆపనిలో ఉన్నారు. మరో రెండు లేదా మూడు రోజుల్లో తుఫాను ప్రభావంతో ఆస్తి, పంట నష్టం అంచనాలు వస్తాయి.

ప్రజాశక్తి : స్పందన కార్యక్రమంల్లో భూ సమస్యలే అధికంగా వస్తున్నాయి. కారణం ఏమిటి...?

ఆర్‌డిఒ: స్పందన కార్యక్రమాలకు ప్రధానంగా భూ సమస్యలే అధికంగా రావడానికి కారణం రైతులవద్ద ఉన్న రికార్డులు, ప్రభుత్వం వద్ద రికార్డులో తేడాలున్నాయి. ప్రధానం హద్దుల విషయంలో తగాదాలు అధికం వీటిని సరి చేస్తున్నాం. భూమి అనేది అత్యత విలువైంది కావడంతో సమస్యలు వస్తున్నాయి.

ప్రజాశక్తి: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు....?

ఆర్‌డిఒ: ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవిన్యూ సిబ్బంది ఇది ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేయడం జరగుతోంది. ఎవ్వరైనా ప్రభుత్వ భూములను అక్రమించుకోవాలని చూస్తే రెవిన్యూ పరంగా కేసులు పెడుతున్నాం. ప్రజలకు కూడా ప్రభుత్వ భూములు రక్షణకు సహకరించాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి: ప్రస్తుతం రెవిన్యూ సిబ్బంది ఏ పనిలో ఉంటున్నారు....?

ఆర్‌డిఒ: రెవిన్యూ సిబ్బంది తమ విధులతో పాటు తుఫాను సమయాల్లో అత్యవసర సేవలు, సహాయ సేవల్లో ఉంటున్నారు. ఓటరు నమోదు కార్యక్రమాల్లో ఉన్నారు. ఎన్నికల నిబంధన మేరకు సమగ్ర ఓటరు జాబితా తయారీలో రెవిన్యూ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వానికి అవసరాల కోసం భూ సేకరణ చేస్తున్నాం.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- అక్రమ తవ్వకాలు అడ్డుకొని గ్రామస్తులకు రక్షణ కల్పించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శ వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి-నగరి: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని సత్రవాడ వద్ద గుట్టను అక్రమంగా నేషనల్ హైవే కాంట్రాక్టర్ గ్రావెల్ తరలించడాన్ని ఆయన తప్పుబట్టారు. అనుమతులు లేకుండా గుట్టను తవ్వేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సత్రవాడ వద్ద ఇష్టారాజ్యంగా క్వారీల్లో పెద్ద ఎత్తున పేలుళ్లలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుట్ట ఉండటం వల్ల కాస్త గ్రామంపై క్వారీ పెలుళ్ల ప్రభావం అంతగా లేదన్నారు. గ్రావెల్ తవ్వకాలు జరిపి గుట్ట స్వరూపాన్ని కనుమరుగు చేస్తే గ్రామాల్లోని ఇండ్లు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందన్నారు. క్వారీల కాలుష్యం వల్ల ఇప్పటికే ఆ ప్రాంతంలో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. పేదల నివాసాల వద్ద కాంట్రాక్టర్లు, క్వారీ యజమానులు అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరుపి కోట్లు గడిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఆయన ఖండించారు. నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో క్వారీలు, గ్రానైట్స్ పర్మిషన్ లేకుండా ఇష్టారాజ్యం నడుపుతున్న మైనింగ్, రెవెన్యూ డివిజన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సహజవనరులను కాపాడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమంగా ఉన్న గ్రానైట్స్, క్వారీలపై చర్యలు తీసుకోవాలని అదే విధంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న కాంట్రాక్టర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలను ఐక్యం చేసుకొని తవ్వకాలు అడ్డుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలి




జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: "ప్రతి రోజు ఒక కొత్త రకం సైబర్ నేరాలు పుట్టుకొస్తున్నాయి, ఇది మెట్రో పాలిటన్ నగరాల్లో ఎక్కువగా జరిగే సైబర్ నేరాలు పట్టణాల్లో కూడా చోటు చేసుకొనే ప్రమాదం లేకపోలేదు. సైబర్ నేరగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు తెలియజేశారు. నకిలీ టిఆర్ఎఐ (టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) లేదా ఎఫ్ఇడి ఈఎక్స్ (కొరియర్) కంపెనీ నుండి ఒక వ్యక్తికి తెలియని నంబర్ నుండి రికార్డ్ చేయబడిన కాల్ వస్తుంది. వెంటనే మొబైల్ నంబర్ త్వరలో ట్రాయ్ పద్ధతి ప్రకారం లేదని, మొబైల్ నంబర్‌కు ఉగ్రవాద సంబంధాలు ఉన్నట్లు గుర్తించబడిందని మరియు హవాలా ఆపరేటర్ల ద్వారా కొంత డబ్బు వ్యక్తి ఖాతాలో జమ చేయబడిందని కావున నెంబర్ కు గల సేవలు త్వరలో నిలిపి వేయ ఎబడుతుందని కాలర్ ద్వారా తెలియజేస్తారు. సేవలు ఆగకూడదు అంటే '9' క్లిక్ చేయమని అడుగుతారు. ప్రామాణికత కోసం ప్రశ్నించినప్పుడు, కాల్ చేసిన వ్యక్తి లక్ష్యాన్ని స్కైప్ కాల్‌లో రమ్మని అడుగుతాడు డిజిటల్‌గా అరెస్టు చేస్తామని తెలియజేస్తూ వెంటనే, కాలర్ కు సిబిఐ, ఆదాయపు పన్ను వంటి భద్రతా సంస్థల నుండి నకిలీ నోటీసును ఆన్లైన్ లో పంపుతారు. ఆ తర్వాత, మోసగాళ్లు కాలర్ పట్ల సానుభూతి పేరుతో, సహాయం చేస్తామని ధవీకరణ వేషంలో బ్యాంక్ వివరాలను తీసుకొని నకిలీ ప్రభుత్వ ఖాతా నంబర్‌లో కొంత డబ్బు వేయమని మరియు వారు జమ చేసిన డబ్బును రెండు-మూడు రోజుల్లో మొత్తాన్ని తిరిగి ఇస్తామని మోసం చేస్తారు.పోలీసుల ప్రకారం ఎఫ్ఇడి ఈఎక్స్ అనే కంపెనీ కొరియర్ కంపెనీ ఏజెంట్లుగా నటిస్తున్న మోసగాళ్లు ఇదే పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ఈ రకమైన సైబర్ మోసం గత ఆరు నెలలుగా నమోదౌతుందని జిల్లా ఎస్పీ ఒక ప్రకటన లో తెలిపారు. పై తెలిపిన విధంగా మీరు ఏదైనా కాల్ ను అందుకుంటే వారి మోసపూరిత మాటలకు మోసపోకుండా వెంటనే మీ పోలీస్ స్టేషన్ లో కానీ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేయాలని తెలిపారు.

భూమిలిచ్చే రైతులకు పరిహారం చెల్లిస్తాం..

- ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ పెప్పర్ మోషన్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం భూములు ఇచ్చే రైతులకు సంతృప్తికరమైన పరిహారం చెల్లిస్తామని అలాగే ఆ కుటుంబంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం ఇస్తామని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. మండలంలో పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలకు ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పుంగనూరు ప్రాంతం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థకు ఇక్కడ భూములు ఇవ్వాలని నిర్ణయించారు. పెప్పర్ మోషన్ కంపెనీ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ కోసం నిధులు జమ చేయాల్సి ఉన్నదని కంపెనీ వారు నిధులు చెల్లించిన వెంటనే రైతులకు సంతృప్తి కరమైన విధంగా పరిహారం చెల్లిస్తామన్నారు. అదేవిధంగా భూమి ఇచ్చిన వారి కుటుంబంలో ఉన్న అర్హులైన అందరికీ ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఫ్యాక్టరీలు ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు నిదర్శనం అనంతపూర్‌లో నిర్మించిన కియా కార్ల కంపెనీ అని చెప్పారు. కియా వలన అన్ని రకాలుగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. భూమి ధర కూడా పెరిగిందని చెప్పారు. అందుకే సిఎం పుంగనూరు ప్రాంతంలో పెప్పర్‌మోషన్ పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జెడ్పిటిసి జ్ఞానప్రసూనచంద్రరెడ్డి, పీకేఎం మూడా చైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ హలీంభాష తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడవ దశ మిషన్ ఇంద్రధనస్సు

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: నేటి నుంచి మూడవ దశ మిషన్ ఇంద్రధనస్సు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్చార్జి అధికారి డాక్టర్ రవిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 0-2 సంవత్సరం లోపల పిల్లలు ఇప్పటివరకు ఏదైనా మిస్సయిన వ్యాధి నిరోధక టీకాలను 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఈ ఆరు రోజులు గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుపబడును .కావున తల్లులు తప్పక తమ చంటి పిల్లలకు మిస్ అయిన టీకాలను ఇప్పించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని కోండమైనది. ఈ విషయాలను ఆరోగ్య కార్యకర్తలు ,ఆశ కార్యకర్తలు ఇంటింటికి అవగాహన కార్యక్రమం చేపట్టాలని తెలిపారు. ఈ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం పూర్తయిన ఏ రోజు కా యూవిన్ యాప్ నందు అప్లోడ్ చేయాలని తెలిపారు.

కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శికి నివాళి

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కన్నం రాజేంద్రన్ మరణం పట్ల సిపిఐ చిత్తూరు జిల్లా సమితి తీవ్ర దిగ్భ్రాంతిని తెలియజేసింది. కామ్రేడ్ కన్నం రాజేంద్రన్ చిత్రపటానికి సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు కే.మణి, ఏఐటియుసి చిత్తూరు నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర, దళిత హక్కుల పోరాట సమితి చిత్తూరు నగర అధ్యక్షులు గజేంద్రబాబు, అఖిల భారత యువజన సమైక్య జిల్లా ఉపాధ్యక్షులు హెచ్.బాలాజీరావు, చాంద్ బాషాలు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆటోసెన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు

43 మంది విజయం విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ప్రముఖ బహులజాతిసంస్థ అయిన ఆటోసెన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఈనెల 9వ తేది శనివారం స్థానిక విజయం సైన్సు అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశా నందునిర్వహించిన ప్రాంగణ ఎంపిక యొక్క తుది ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. అందుతో తమ కళాశాల తృతియ సంవత్సరం చదువుతున్న బికాం,బిఏ విద్యార్థులు 43 మంది ఎంపికైనట్లు విజయం విద్యా సంస్థల అధినేత తేజోమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు రాత్ర, మౌఖిక ద్వార నిర్వహించారని, ఎంపికైన విద్యార్థులకు వార్షిక జీతం 1,80 వేల నుండి 2,40 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించారు.

యుటిఎఫ్ రాష్ట్ర కమిటిలో ఐదుగురికి అవకాశం

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: యూటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు డిసెంబర్ 9 ,10 తేదీలలో ఏలూరులోని చలసాని గార్డెన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిత్తూరు జిల్లా నుండి రాష్ట్ర కార్యదర్శిగా జి.వి.రమణ, కార్యవర్గ సభ్యులుగా టి.రఘుపతి రెడ్డి, ఎం.సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, దీనావతిలకు అవకాశం కల్పించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ రాబోయే సంవత్సరంలో ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయాలన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.7.50 లక్షలు విరాళం



ఆలయ నిర్వాహకులతో జీజేఎం ట్రస్ట్ అధినేత

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్థానిక మురకంబట్టులోని శ్రీ వరసిద్ధి వినాయస్వామి ఆలయంలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండప నిర్మాణం కోసం జీజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్‌నాయుడు రూ.7.50లక్షలు స్టీల్‌ను అందించారు. ఆదివారం మురకంబట్టులోని ఆలయాన్ని ఆయన పరిశీలించారు. స్వామి దర్శనం అనంతరం చిత్తూరు నగర ప్రజలపై స్వామి అనుగ్రహం ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులకు కల్యాణ మండపం కోసం స్టీల్‌ను కొనుగోలు చేసేందుకు అయ్యే ఖర్చు రూ.7.50లక్షలను అందజేశారు. కార్యక్రమంలో జిజెయం చారిటబుల్ ఫౌండేషన్ కార్యనిర్వా హకు లు గురుజాల చెన్నకేశవనాయుడు, టిడిపి 2వ డివిజ న్ ఇంచార్జ్ ఉదయ్ కుమార్, నిత్యానందం, గోపి, వెంక టేష్, నాగరాజు, మణి, హరి, కార్తీక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

గొడుగుల వితరణ

జీజెఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటికి ఫోటోలు గొడుగులు మరియు ప్లాస్టిక్ రహిత సంచులను జీజేఎం ట్రస్ట్ ప్రతినిధి గురజాల చెన్నకేశవులు నాయుడు పంపిణీ చేశారు. ఆదివారం గుడిపాల మండలంలోని నారగల్లు, ఆదిలక్ష్మాంబ పురం గ్రామల పంచాయితీ పరిధిలోని గ్రామాలకు ప్రతి ఇంటింటికీ దేవుని ఫోటోలు గొడుగులు మరియు ప్లాస్టిక్ రహిత సంచులను మండల పార్టీ అధ్యక్షులు సి సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో జిజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ గురుజాల జగన్మోహన్ నాయుడు గారి సొంత నిధులతో వితరణ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యనిర్వహకులు జనసేనపార్టీ అధ్యక్షులు రూప్‌కుమార్, సర్పంచ్ గుర్రప్పనాయుడు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రతి సోమవారం జిల్లా సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం 11వ తేది సోమవారం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అధికార్లుతప్పని సరిగా పాల్గొన్నాలని తెలిపారు.

గంగవరం.. టీడీపీలో గరంగరం!

- మాజీ ఎమ్మెల్యే రేపెట్టిన రాజకీయ ప్రకంపనలు
- అనుచరవర్గంతో ఆత్మీయ సమావేశంలో అసంతృప్తి వెల్లగక్కిన వైనం
- వారంలో పార్టీ మారే నిర్ణయాన్ని వెల్లడిస్తానన్న బోస్



మీడియాతో మాట్లాడుతున్న చంద్రబోస్

ప్రజాశక్తి-గంగవరం: పలమనేరు నియోజకవర్గ టీడీపీలో రాజకీయ ప్రకంపనలు రేకెత్తాయి. మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి సుభాష్ చంద్రబోస్ ఆదివారం అనుచర వర్గంతో కలసి గంగవరంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి పెద్ద ఎత్తున ఆయన అభిమానులు హాజరైయ్యారు. సమావేశంలో ఆయన 1982 నుంచి ఎన్‌టీఆర్‌తో కలసి టీడీపీ కోసం చేసిన కృషిని క్యాడర్‌తో పంచుకున్నారు. ప్రస్తుతం టీడీపీ నేతలు తన కష్టాన్ని విస్మరించారని అసహనం వ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో అప్పటి వైసీపీ అభ్యర్థి అమరనాథ్‌రెడ్డిపై పోటీ చేసి స్వల్ప మెజారిటీతో పరాజయం పొందగా 2019లో టీడీపీ అదిష్టానం ఆదేశాల మేరకు మళ్లీ అమరనాథ్‌రెడ్డికి సహాయ సహకారాలు అందించినట్లు వివరించారు. పదవులు రాకపోయినా, ఆర్థికంగా చితికిపోయినా నిరుత్సాహ పడకుండా పార్టీ కోసం కష్టపడినట్లు అభిమానులతో పంచుకున్నారు. కష్టానికి తగినట్లు తనను గురించడం లేదని ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. తొందరలో రాజకీయంగా ఓ నిర్ణయం తీసుకుంటానని అందుకు అందరి మద్దతు కావాలని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో తనకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఏ పార్టీలో చేరబోతున్నారు అని విలేకరుల ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. తమ అభిమానులతో, ఆత్మీయులతో చర్చించి వారంలో రాజకీయ నిర్ణయం ప్రకటిస్తానన్నారు. ఆదివారం జరిగిన ఈ ఆత్మీయ సమావేశంతో స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. టీడీపీలో ఒకింత రాజకీయ ప్రకంపనలు రేగినట్లైందని చెప్పుకుంటున్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-సోమల: మండలంలోని రెండు పంచాయతీలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఉదయం అన్నెమ్మ గారి పల్లి నందు, మధ్యాహ్నం మండల కేంద్రమైన సోమల నందు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పి ఉన్నత పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 70మంది స్థానికులు పరీక్షలు చేయించుకోగా 35మంది శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రమణ, చంద్ర, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని బేతేల్షారోన్ చర్చిలో ఫాస్టర్ ఆశీర్వాధం ఆధ్వర్యంలో ముందుస్తు క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా జపురుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆశీర్వాధం మాట్లాడుతూ డిసెంబర్ మాసం యేసుప్రభువు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెలను పవిత్రంగా బావించి మందిరాలపై, ప్రతి ఇంటిపై శిలువుతో కూడిన స్టార్లను ఏర్పాటు చేసి ప్రభువును మహిమపరుస్తారని చెప్పారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్బాబు, పాస్టర్ హరిబాబు, పాస్టర్ ఫాల్ (కాణిపాకం పట్టణం) విశ్వాసకులు పలువురు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సింగిల్ విండో అధ్యక్షులు హేమచంద్రనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పేదలందరికీ అన్నా క్యాంటీన్ ద్వారా కడుపునింపడం జరిగిందన్నారు. కాగా ప్రస్తుతం మండల కేంద్రంలో క్యాంటీన్ ప్రారంభించి అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌గౌడ్, ఉప సర్పంచ్ లోకనాథంనాయుడు, వంశీ చౌదరి, సురేంద్ర నాయుడు, చిన్నయ్య, గురుస్వామి, గిరిబాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల మృతికి సంతాపం



ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు జవుకుపల్లిలో సుందరమ్మ, కావలిమడుగులో ప్రతాప్ ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఆ పార్టీ నాయకులు మృతదేహాలకు నివాళులు అర్పించి ఆర్థిక సాయంగా రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమాల్లో మునస్వామి, రామమూర్తి, కృష్ణారెడ్డి, మనేష్, గంట్లప్ప గౌడు, చంద్రారెడ్డి, శ్రీనివాసులు గౌడ్, విశ్వనాథ్, పరశురామ్ ఉన్నారు.


39వ డివిజన్‌లో మేయర్ పర్యటన



మురికి కాలువలు పరిశీలిస్తున్న నగర మేయర్ అముద

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగర మేయర్ ఆముద 39వ డివిజన్‌కు సంబంధించిన పెద్ద దళితవాడలో పర్యటించారు. ఈ సందర్భంగా డ్రేనేజీలు, తాగునీటి, పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. మురికి కాలువలు నిర్మాణం చేపట్టడానికి, మురికి నీళ్లు కాలువల్లో నిలువ లేకుండా ప్రవహించే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి పెనుమూరు బాబు, వాలంటీర్లు, మహిళలు సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు



ప్రజాశక్తి-సోమల: సోమల మండలం నుండి 80 కిలోమీటర్ల దూరంలోని సోమల మండలానికే చెందిన ముచ్చుకాలవ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శివ రత్నమ్మ, సిఆర్పి సోమశేఖర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అస్లాం ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలో 15 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందిస్తున్నారని, పాఠశాలలో పనిచేస్తున్న ఏకోపాధ్యాయుడు సుధాకర్ విద్యార్థుల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రతిరోజు పాఠశాలను సందర్శిస్తూ ఆదివారం కూడా విద్యార్థులకు తన సొంత ఖర్చుతో భోజనం అందజేస్తున్నారని తెలిపారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాల్సి ఉందని ఇందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, గ్రామం మొత్తం నిరుపేద దినసరి కూలీలు కావడంతో విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఎటువంటి పరిస్థితులలోనూ విద్యార్థులను పాఠశాల మాన్పించకుండా పంపించాలని ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం యూనిఫామ్ ఉచిత పాఠ్యపుస్తకాలు అమ్మ ఒడి తదితర అంశాలన్నీ వారికి వివరించినట్లు తెలిపారు.

పత్రికా స్వేచ్ఛను కాల రాస్తున్నారు

- జగన్ భారత రాజ్యాంగాన్ని చదవాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్



ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్రంలో పేదవాళ్ళు మూడు పూట్ల తిండి లేక పస్తులున్నారు. ప్రతి కుటుంబం అప్పుల పాలై ఉన్నారు. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అని కాంగ్రెస్ కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మండలంలోని పుల్లూరు క్రాస్ రోడ్ లో మార్పు రావాలి కాంగ్రెస్ కావాలి అనే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగాన్ని చదివినట్టు లేదు బైబిలు చదివినాడేమో అన్నారు. భారత రాజ్యాంగంలోని పత్రిక స్వేచ్ఛ ఒక హక్కు, ఈ పేపర్ చదవొద్దు, ఆ పేపర్ చదువుతూ అంటూ పత్రిక స్వేచ్ఛను హరించుతున్నాడన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నరసింహులు పోటుగారి భాస్కర్, తులసమణి, కన్నన్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: బీజేపీ కేంద్ర ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం తద్యం అని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ జోస్యం చెప్పారు. ఆదివారం వెదురుకుప్పం మండలంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఆధ్వర్యంలో "మార్పు కావాలి - కాంగ్రెస్ రావాలి" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి చింతా మోహన్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని ప్రజలు ఎంతో ఆసక్తిగా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తద్యమన్నారు. మోడీ పేదల నడ్డి విరిచి ఆదాని లాంటి ధనవంతులను మరింత ధనవంతులుగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వం కూడా మోడీ అడుగు జాడల్లో నడుస్తూ రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు కన్వీనర్ కలికిరి నారాయణ స్వామి, పీసీసీ డెలిగేట్ పరదేశీ పాల్గొన్నారు.

ఎంపిడివో శ్రీనివాసన్ సేవలు ఎనలేనివి

టిడిపి నాయకులు



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: ఎంపీడీవో శ్రీనివాస్ సేవలు ఎనలేనివని చిత్తూరు తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు. గతంలో చిత్తూరు ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసన్ అనారోగ్య కారణాలతో ఆదివారం మతి చెందారు. ఈ క్రమంలో స్థానిక మురుగానపల్లిలోని తన నివాసంలో ఉదయం తుది శ్వాస విడిచిన శ్రీనివాసన్ ప్రస్తుతం గుడిపల్లి మండలానికి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో చిత్తూరు రూరల్ మండల ఎంపీడీవోగా పని చేసిన కాలంలో అనేక సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాల్లో తన వంతుగా అధికారులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులకు శ్రీనివాసన్ తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఈ నేపథ్యంలో ఆయన మతదేహానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గీర్వాణి భర్త, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత చంద్రప్రకాష్, జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్, జిల్లా టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు మేషక్, దిగువమాసాపల్లి మాజీ సర్పంచ్ జగదీశ్వరనాయుడు, టిడిపి ముఖ్య నేత శోభన్ బాబు, చిత్తూరు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి రఘు, అనంతాపురం సర్పంచ్ శ్యామ్, ఆనగల్లు సర్పంచ్ కరుణాకర్, కుర్చివేడు సర్పంచ్ దిలీప్, మండల టిడిపి నాయకులు చల్లా, కందసామి, బాలకష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొని శ్రీనివాసన్ మతదేహానికి ఘనంగా నివాళులర్పించడంతో పాటు, ఎంపీడీవో కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అదే విధంగా చిత్తూరు మండలానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు ఎంపీడీవో మతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

యుద్ధ ప్రాతిపదికన కాజ్‌వేలకు మరమ్మతులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు, పుత్తూరు టౌన్ : తుపాను ప్రభావంతో అరుణానది ఉధృతికి దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తున్నట్లు జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ తెలిపారు. ఆదివారం పీఆర్ ప్రాజెక్ట్స్ డీఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన మండలంలో తుపాను దెబ్బకు కొట్టుకుపోయిన తుంబూరు, పాలమంగళం నార్త్ కాజ్‌వేలను పరిశీలించారు. సుమన్‌కుమార్, సర్పంచ్ సాయిరవి చొరవ తీసుకుని పాలమంగళం నార్త్ కాజ్‌వేపై గ్రావెల్‌తో రాకపోకలకు సిద్ధం చేశారు. సుమన్‌కుమార్ రూ.10వేల రూపాయలు సాయం అందివ్వగా, సాయి రవి 30 ట్రాక్టర్ ట్రక్కుల గ్రావెల్‌ను కాజ్‌వేకు మరమ్మతులు చేసి ఆదివారం సాయంత్రానికి పూర్తి చేశారు. కొట్టుకుపోయిన తుంబూరు కాజ్‌వేపై ఇసుక బస్తాలతో రాకపోకలకు దారిని సిద్ధం చేయాలని సుమన్‌కుమార్ సూచించారు. అరుణానది ప్రవాహానికి వరుసగా మూడు సార్లు కోతకు గురయిన తుంబూరు కాజ్‌వేకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సుమన్‌కుమార్ డీఈ ప్రభాకర్ రెడ్డిని కోరారు.

పాలకులను సరిచేయాల్సిన బాధ్యత ప్రజలదే..

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాజ్యాంగాన్ని పక్కనపెట్టి తనకు నచ్చిన విధంగా వ్యవహరిస్తున్న పాలకులను సరిచే యాల్సిన బాధ్యత ప్రజలదేనని మాజీచీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యా లయంలో ఆదివారం సిటిజన్స్ ఫర్ డెమొక్రసి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా పాలన లేకపోతే పలు ప్రమాదాలు వాటిల్లుతాయి అన్నారు. చట్టసభల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తితో చర్చలు జరగాలని పేర్కొ న్నారు. మనం ఎన్నుకొన్న ప్రజా ప్రతి నిధులు చేస్తున్న తప్పులను కచ్చితంగా ఎత్తిచూపాలని అన్నారు. మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొర బడిందన్నారు. దాన్ని ప్రశ్నించేందుకే సిఎఫ్‌డి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. అవకతవకలు సవరించి ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విఫలమయ్యారని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూలేని రీతిలో ఓటర్ల జాబితాపై విమర్శలున్నాయి అని గుర్తు చేశారు. ఓటర్ల జాబితా తయారీకి వినియోగించిన సిబ్బంది వ్యవహారమే దీనికి కారణమని తెలిపారు. ఓట్లను గంపగుత్తగా తొలగించ కూడదన్న కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు రాష్ట్రంలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ రాష్ట్రానికి మరోసారి ఎందుకు కావాలి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సిబ్బందితో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం శోచనీయమన్నారు. ప్రభుత్వ తీరును సీఎఫ్ డి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లిందని తెలిపారు. రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం సలహాదారులను నియమించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంవి రావు, భీమని ప్రసాద్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కృష్ణారావు, లక్ష్మణ రెడ్డి, రఘు, పల్గుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొంత లాభం కొంత మానుకో: మురళీ నాయుడు

ప్రజాశక్తి -తొట్టంబేడు: ప్రతి మనిషి సొంత లాభంలో కొంత పేదల కోసం ఖర్చు చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి మురళీ నాయుడు పిలుపు నిచ్చారు. ఆ పార్టీ బీసీ సెల్ విభాగం మండలాధ్యక్షుడు సురేంద్ర యాదవ్ ముద్దుల కుమార్తెలు హృతిక, మైథిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని శివనాథపురం అమ్మ మహిళా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మురళీ నాయుడు మాట్లాడుతూ తన కుమార్తెల జన్మదినం రోజు పేదలకు అన్న దానం చేసిన సురేంద్రను అభినందించారు. ప్రతి ఒక్కరూ తమకున్న దాంట్లో పేదలకు సాయం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురేంద్రను ఆదర్శంగా తీసుకుని పేదలకు సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు భూలక్ష్మి, టీడీపీ నాయకులు తిరుపతి పార్లమెంట్ రైతు విభాగ ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు. లోకనాథం, కిషోర్, దొరబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

తుపాన్ బాధితులకు అండ: జనసేన

ప్రజాశక్తి -వరదయ్యపాలెం : మండలంలోని పులివెల్లం గ్రామ పంచాయతీలో స్థానికుడు దళితుడు నాగేంద్ర ఇల్లు తుపాన్ కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయి ఆర్థికంగా నష్టం జరిగింది. ఇది తెలుసుకున్న జనసేన వరదయ్యపాలెం మండలం కమిటీ అధ్యక్షులు చిరంజీవి యాదవ్ నాగేంద్ర కుటుంబానికి అర్థిక సాయం, నిత్యావసర సరుకులను ఆదివారం అందించారు. ఈ సంద్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ నుంచి న్యాయం జరిగేలా వరదయ్యపాలెం జనసేన మండల కమిటీ పోరాడుతుందన్నారు. అన్ని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజలకు ఎక్కడ సమస్య వస్తే ఆసమస్యను పరిష్కరించడానికి జనసేన మండల కమిటీ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు, ఈ సమస్య పై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను అదుకోవలని కోరారు. ఈ కార్యక్రమం లో శేఖర్, తులసి రామ్, కేశవ్ వెంకటేష్ జనసేన ప్రధాన కార్యదర్శి ముని రత్న, మహేష్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు

గిరిజనులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి -తొట్టంబేడు: వర్షాలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని గిరిజనులు తెలియజేయడంతో కాసరం ఎస్టీ కాలనీలో పేదలకు దుప్పట్లు, పండ్లు ను పంపిణీ చేసిన నేషనల్ కన్స్యూమర్ రేట్స్ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి గిరిజన కాలనీలోని సుమారు 30 మంది కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో సమస్యలను తెలుసుకొని అధికారులకు తెలియజేసి త్వరగా పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో ప్రభాకర్, సంద్ర మహేష్, రోమాల గురువారెడ్డి, రోమాల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంపూర్ణమ్మ, ప్రజా ప్రతి, ప్రతాప్, పరుశురాం, విజయ్, సుబ్బయ్య, రాము పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక వాకర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వాకర్సు అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవి రాజు, ఎన్నికల అధికారి, న్యాయవాది గాలి రమేష్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గ సభ్యులుచే అధ్యక్షులుగా కేవల్ మూర్తి కార్యదర్శిగా, ముని కృష్ణయ్య. ట్రెజరర్‌గా గుణశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దాము నాయుడు, ద్వారకనాథ్ శెట్టి, వాకర్ గా రఘునాథ రెడ్డి, కమిటీ సభ్యులుగా శంకు నాదం, సుధాకర్ శెట్టి, పదిమంది సభ్యులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కేవల్ మూర్తి మాట్లాడుతూ వాకర్స్ సభ్యులందరూ ఐకమ త్యంతో సేవా కార్యక్రమాల్లో పాల్గొని విజయ వంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్ గవర్నర్ రావిళ్ళ మాధవ నాయుడు, కె కుప్పయ్య శెట్టి, చెంచయ్య, గోపికృష్ణ, మురుగేష్ న్ రెడ్డి, వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి:ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : అమరావతి ఆసుపత్రిలో డయా లసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమని కిడ్నీ బాధితులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకో వాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వర ప్రసాదరావు కోరారు. గూడూరు పట్టణంలోని అమరా వతి ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే వరప్రసాదరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని సదుపాయాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు మాట్లాడుతూ గూడూరు పట్టణ పరిధిలో ప్రైవేటు డయాలసిస్ కేంద్రం అమరావతి ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని తెలిపారు. గోపాల్ రెడ్డి, సిపిఐ నాయకులు ప్రభాకర్ , శశి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రత్యేక ప్రతిభా వంతులకు అండగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం నిలబడు తుందని సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యుడు ప్రజేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి ప్రత్యేక ప్రతభావంతులకు చేయూతను నిర్వహించారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ప్రత్యేక ప్రతిభావంతులకు సిద్ధారెడ్డి జనార్దన్ రెడ్డి ప్రత్యేక ప్రతిభావంతులకు చేయూత లో భాగంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి దుర్మరణం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలో కొట్టాలుకు చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్ బోల్తా పడి దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు గంగాధర నెల్లూరు మండలం కొట్టాలు(అగ్రహారం సమీపంలో) గ్రామానికి చెందిన గోపినాయుడు (42) అనే అతను తమిళనాడు సరిహద్దులో గల వడ్డేరి వద్ద ఓ రైతు వరి పైరు నాటడానికి పొలాన్ని దున్నడానికి బాడుగకు వెళ్ళాడు. ఆదివారం పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడగా దీంతో గోపినాయుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు శోకసముద్రంలో మునిగిపోయారు.

ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం

- 38 ఏళ్ల కలిసిన పూర్వ విద్యార్థుల
- 'డైట్'లో సందడే సందడి



ప్రజాశక్తి-కార్వేటినగరం: ఏళ్ల తరువాత పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలిసారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. ఆదివారం కార్వేటినగరంలోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో పూర్వ విద్యార్థులు కలిశారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. 1984-85 ఏడాధికి సంబంధించి ఉపాధ్యాయులు కొలుదీరారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డైట్ ప్రిన్సిపాల్ (తిరుపతి జిల్లా డీఈవో) శేఖర్ మాట్లాడుతూ టీటీసీ ప్రారంభం నుంచి నేటి వరకు జిల్లా విద్యాశిక్షణా సంస్థలో ఛాత్రోపాధాయులుగా శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ గురువులు సేవలు అందించడం కార్వేటినగరం గొప్పతనాన్ని గుర్తు చేస్తుందన్నారు. డైట్ ప్రిన్సిపాలుగా విధులు నిర్వహించి మృతి చెందిన పుల్లారెడ్డి, బ్రహ్మయ్య చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అలాగే గురువులు డాక్టర్ యోగానందం, సుగుణ కుమారి, ప్రభాకర్‌రెడ్డిలకు శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, నిర్వాహకులు డాక్టర్ విజయులురెడ్డి (డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్) వేణుగోపాల్, పొన్నురంగం, వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.

'టీడీపీని ఆదరించండి'

- మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఆదివారం స్థానిక పంచాయతీలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రకటించిన మినీమ్యానిఫెస్టోని వివరించారు. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి కలగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, చలపతి, నాగరాజ, కృష్ణారెడ్డి, ముబారక్, చెంగారెడ్డి, నాగిరెడ్డి, తిప్పారెడ్డి, రుద్రమూర్తినాయుడు, బావాజాన్, మణి, జగదీష్‌నాయుడు, రామూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: టిడిపి పాలనతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని చిత్తూరు జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నెల్లేపల్లి పంచాయతీకి చెందిన అప్పిరెడ్డి కండ్రిగలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ప్రచురించిన మినీ మేనిఫెస్టోను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, శాంతి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్రంలో బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీ తోనే జరుగుతుందని రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కెంచనబల్ల గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నేతలు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, నేతలు గుణశేఖర్, వెంకటరమణ, విశ్వనాథ్ ,రామానుజులు, సత్య, గోవిందప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ప్రపంచ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా చిత్తూరు జిల్లాఎన్‌హెచ్‌ఆర్‌సి కార్యాలయంలో నేషనల్ కన్వీనర్ బుల్లెట్ రవి ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లాఅధ్యక్షులు ధనంజయనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా జరుపుకోన్నారు. ఈ సందర్భంగా నేషనల్ కన్వీనర్ బుల్లెట్ రవి మాట్లాడుతూ కుల, మత, భాష, ప్రాంతీయ, వర్ణ, వర్గ, లింగ భేదములు లేకుండా అడందరికి ప్రపంచం మేధావి రాజ్యంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంను అనుసరించి ఈ దేశంలో పుట్టిన ప్రతి పౌరునికి రాజ్యంగా భద్ధమైన రక్షణ కలిపించడమే మా నేషనల్ హ్యూమన్ రైట్ విధి అని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు డాక్టర్ ధనంజయ నాయుడు మాట్లాడుతు ప్రజలకు ఎక్కడ ఎప్పుడు ఇబ్బంతి కలిగిన మా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు వెంటనే కాల్ చేసి తెలియపరిచిన తాము హక్కుల కోసం పోరాటం చేసి న్యాయం జరిగే విధంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, పూర్ణ చంద్రరెడ్డి. చక్రవరి నాయుడు, రమేష్‌బాబు, సుబ్రహ్మణ్యం, విజయ, కృష్ణమూర్తిరెడ్డి, చక్రి, గుణ, సురేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులపై వైసీపీకి మూల్యం తప్పదు : టీడీపీ



ప్రజాశక్తి-రామకుప్పం: ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై వైసీపీ అక్రమ కేసులు నమోదుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, మనోహర్, ఆదిల్, నవీన్, నాగరాజు పేర్కొన్నారు. సిల్క్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అప్పటి టిడిపి శ్రేణులు రామకుప్పంలో నిరసన కార్యక్రమాలు చేశారు. ఈ కేసుకు సంబంధించి పలువురు టీడీపీ నేతలు ఆదివారం రామకుప్పం పోలీసు స్టేషన్‌లో 41 నోటీసులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గర పడుతోందన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి అక్రమాలు, అరాచకాలకు పాల్పడిన వైసీపీ ప్రభుత్వ దమన నీతిని నిరసిస్తూ.. ఆందోళనలు చేపట్టిన విపక్షాల నేతలు, కార్యకర్తలు, సామాన్య ప్రజలపై అక్రమ కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడ్డారని వారు ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలే తగు బుద్ధి చెబుతారన్నారు.

సోమలలో ఎడారి ఓడ

- తిలకించేందుకు చిన్నారుల ఉత్సాహం



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమలో ఎడారి ఓడ రావడంతో చిన్నారులు, ప్రజలు చూసేందుకు ఉత్సాహం చూపించారు. ఆదివారం నెల్లూరు నుండి ఒంటెల బాషా తన పెంపుడు జంతువైన ఒంటెను గ్రామాలలో తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా సోమల పురవీధులలో ఒంటె తిరుగుతూ ఉండడంతో ప్రజలు ఒంటెను చూసేందుకు ఉత్సాహం చూపి పలువురు తమ చరవాణిల ద్వారా సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది.

జల్లికట్టు.. తప్పని గాయం కట్టు



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: యువకుల కేరింతలు.. కొడెద్దుల రంకెలతో మొదలైన జల్లికట్టు చివరాకరికి గాయాలకట్టుకు దారితీసింది. ఆదివారం మండలంలోని ఉడమలకుర్తి పంచాయతీ ఎన్ఎన్‌డి పురం గ్రామంలో జల్లికట్టు ఉత్సాహంగా తొలత ప్రారంభమైంది. చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వందల సంఖ్యలో ఎద్దులు తీసుకొచ్చారు. పరిసర ప్రాంతాల నుంచి ఎద్దుల పోటీలను చూసేందుకు అధిక సంఖ్యలో జల్లికట్టు ప్రియులు తరలివచ్చారు. ఎద్దులకు ఏర్పాటు చేసిన బహుమతులు కోసం యువకులు హోరాహోరీగా ఎగబడ్డారు. దీంతో అధిక సంఖ్యలో ఒక్కసారిగా తొక్కిసలాట జరగడంతో పలువురు గాయాలపాలైయ్యారు. గాయపడ్డవారిని స్థానికులు 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.